# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట


## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్, నవంబర్ 3, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనికలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 132 ఫిర్యాదులు అందాయి. ఇందులో ఎక్కువగా ఇందిరమ్మ గృహాల మంజూరు కొరకు 60 దరఖాస్తులను అర్జీదారులు అందజేశారు. అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు కూడా వివిధ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు

### సీసీఐ పత్తి కొనుగోలుపై

## రైతుల ఆగ్రహం...

### రాస్తారోకోతో నిరసన

**ఊట్కూర్, నవంబరు 3 ప్రభాతవార్త** :ఊట్కూర్ మండల పరిధిలోని తిప్రాస్ పల్లి గ్రామ సమీపం ఉన్న విజయ కాటన్ మిల్ ఎదుట నారాయణపేట-మక్తల్ ప్రధాన రహదారిపై రైతులు ధర్నాకు దిగారు. సెంట్రల్ కాటన్ కార్పొరేషన్ (సీసీఐ) అధికారులు ఎకరాకు 12 క్వింటాళ్లు పత్తి కొనుగోలు చేస్తామని ముందుగా తెలిపి, ఇప్పుడు మాత్రం ఎకరాకు 7 క్వింటాలు మాత్రమే తీసుకుంటామంటూ వెనక్కు తగ్గడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు రాస్తారోకో చేపట్టి ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ధర్నా ప్రదేశానికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకుడు వడ్ల గంగాధర్ చారి రైతులకు సంఘీభావం తెలియజేశారు. రైతులు కిసాన్ యాప్ ద్వారా స్లాట్లు బుక్ చేసుకుని మిల్లుకు పత్తి తీసుకురాగానే ఎకరాకు 7 క్వింటాళ్ళు మాత్రమే తీసుకుంటాం" అని చెప్పడం అన్యాయమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్.ఐ రమేష్ అక్కడికి చేరుకొని రైతులను సముదాయించగా, తరువాత జిల్లా మార్కెట్ కార్యదర్శి భారతి, ఏవో గణేష్ రెడ్డి, విజయ కాటన్ మిల్లు దగ్గరకు చేరుకొని రైతుల సమస్యలు తెలుసుకొని ఉన్నత అధికారులతో మాట్లాడి ఎకరాకు 12 క్వింటాలు పత్తి కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో రైతులు సంతోషంతో ధర్నా విరమించారు.

### జిల్లా వ్యాప్తంగా

## పోలీస్ యాక్ట్ అమలు

- ముందస్తు అనుమతి లేకుండా కార్యక్రమాలు,
- ర్యాలీలు బహిరంగ సభలు, నిషేధం
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు
- ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించే సమావేశాలు పూర్తిగా నిషేధం



**వనపర్తి, నవంబరు 3 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజా వాతావరణం ప్రశాంతంగా కొనసాగించేందుకు నవంబర్1 నుండి నవంబర్ 30 వరకు 30పోలీస్‌యాక్ట్ నిబంధనలు అమల్లో ఉంటాయని ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30పోలీస్ యాక్ట్-1861 ప్రకారం జిల్లాలో డిఎస్పీ లేదా ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,ర్యాలీలు, బహిరంగ సభలు, లేదా ప్రజలు గుమికూడే కార్యక్రమాలు నిర్వహించడం కఠినంగా నిషేధం అని స్పష్టం చేశారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించే లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే బహిరంగ సమావేశాలు పూర్తిగా నిషేధించబడతాయి. చట్టపరమైన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే, 30 పోలీస్ యాక్ట్ - 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని ఎస్పీ హెచ్చరించారు. ప్రజా శాంతి భద్రతల పరిరక్షణే మా ప్రధాన బాధ్యత. నిబంధనలు అందరూ పాటించాలి.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్3,ప్రభాతవార్త:** ప్రజావాణిలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసీ(కలెక్టరేట్) కార్యాలయంలో నిర్వహించిన –మిగతా4లో..

# ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం..

- ప్రపంచంలోనే ఎక్కడా లేని టెక్నాలజీతో పనులు
- 30టీఎంసీలతో 3లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు
- నల్గొండ జిల్లాలో 30లక్షల మందికి తాగునీరు అందిస్తాం..
- పదేండ్లలో 10కిలోమీటర్ల టన్నెల్ పూర్తి చేయలె..
- కేసీఆర్, హరీశ్‌రావు ప్రాజెక్టును పక్కన బెట్టారు
- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సందర్శన



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



సర్వే చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఎం, మంత్రులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్3,ప్రభాతవార్త :** శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టు (ఎస్ఎల్‌బీసీ)లో సొరంగ మార్గంలో పనులను ఎలాంటి పరిస్థితుల్లోనూ పూర్తి చేసి తీరుతాయని ఈ విషయంలో ప్రపంచంలోనే అత్యాధునిక టన్నెల్ టెక్నాలజీతో పనులు చేపట్టడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా మన్నేవారిపల్లిలో హెలీ మాగ్నెటిక్ సర్వేకు సంబంధించిన సర్వే హెలికాప్టర్‌తో పాటు... అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న వివరాలు, అందుకు సంబంధించిన పరికరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు పరిశీలించారు. దీంతో పాటు టన్నెల్‌లో చేపట్టబోయే పనులకు సంబంధించి వివరాలను అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకం పనుల పునరుద్ధరణలో మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వే వివరాలను ముఖ్యమంత్రి, మంత్రుల బృందంకు సవివరింగా సంబంధిత అధికారులు తెలిపారు. ఈ సర్వే నేషనల్ జియోఫిజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఐ) శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని...హెలికాప్టర్‌కు ప్రత్యేకంగా అమర్చిన ట్రాన్స్‌మీటర్‌తో సర్వే నిర్వహించడం జరుగుతుందని అధికారులు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో

**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...**

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించడానికి వచ్చిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ ,బాలు నాయక్, ఆర్మీ అధికారులు, సబ్ వే ఆఫ్ ఇండియా అధికారులు ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు 3 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మంది కి తాగునీరు నల్గొండ జిల్లాకు అందించాలని ప్రారంభించారని తెలిపారు. అప్పట్లో ప్రారంభించిన పనులు నిలిచిపోగా... తిరిగి 2004 అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో ప్రారంభించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఈ విషయంలో టన్నెల్ -వన్ 44 కిలోమీటర్లు, టన్నెల్-2 మూడు కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. అప్పట్లో ఇది టైగర్ రిజర్వు ఫారెస్టు అని... పులులను సంరక్షించి వాటికి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా పూర్తి చేయాలని అప్పట్లోనే నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. టన్నెల్ బోర్ నిర్మాణం భారతదేశంలోనే మొదటిసారిగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు వినియోగించడం జరుగుతుందన్నారు. అప్పట్లో పది కిలోమీటర్ల టన్నెల్‌ను సైతం అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పూర్తి చేయలేదని... ఈ విషయంలో కేసీఆర్, హరీష్‌రావులు ఈ ప్రాజెక్టును పక్కన బెట్టారని... అందుకు కారణం వారికి రావాల్సిన పర్సెంటేజీ రాదని చేయలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. ఈ విషయంలో అప్పటి సీఎం చంద్రశేఖర్ రావు కుటిల నీతితో వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ టన్నెల్‌ను ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా 44 టన్నెల్ ఎక్కడా లేదని... ఈ టన్నెల్ పూర్తయితే 30 టీఎంసీల నీటితో 3 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించడం ఎంతో వీలుగా ఉంటుందని తెలిపారు. ఈ టన్నెల్ ప్రస్తుతం రూ.4,600 కోట్లతో పూర్తయ్యేందుకు చర్యలు రూపొందించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ పనులు పూర్తి చేసుకోకపోవడం వల్ల నెట్టెంపాడు, బీమా, కల్వకుర్తి వంటి పనులు ఏ ఒక్కటి కూడా అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు చేయలేదని... లక్షా ఎనభై ఆరు వేల రూపాయల్లో కాంట్రాక్టర్లకు పనులు పూర్తి కాకుండానే చెల్లించారని వివరించారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో నీటిని తరలించుకుపోతున్నారని...అప్పట్లో కేసీఆర్, హరీశ్ రావులు వెళ్ళి నీటిని తీసుకెళ్ళమని సంతకాలు పెట్టి వచ్చారని 299 టీఎంసీలకు ఒప్పుకున్నట్లు ట్రిబ్యునల్‌లో అడగడానికి వీల్లేదని తెలిపారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో ట్రిబ్యునల్‌లో వాదనలు వినిపిస్తున్నామని...ఒక కొలిక్కి వచ్చిందని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు అలుసుగా మారిందని ఈ విషయంలో కేసీఆర్ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అత్యంత తక్కువ ఖర్చుతో 30 టీఎంసీల నీరు తీసుకెళ్ళే టన్నెల్ ఎక్కడా లేదని తెలిపారు. ఈ పనులు చేపట్టిన క్రమంలో ఎనిమిది మంది చనిపోయారని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిపుణులైన ఆర్మీ అధికారులను డిప్యూటేషన్‌పై తీసుకురావడం జరిగిందన్నారు. ప్రస్తుతం 9.8 కిలోమీటర్లు టన్నెల్ పనులు కావాల్సి ఉంది వీటిని మంత్రి వర్గంలో ఆమోదించడం జరిగిందన్నారు. ఈ విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు చిల్లరమాటలు మానేయాలని... ఇప్పటికైనా హరీశ్ రావు మారాలన్నారు. ఈ ప్రాంతం నుంచి – మిగతా4లో..

## అక్షయపాత్ర సేవలు మరువలేనివి

### లాభాపేక్ష లేకుండా సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



వేపూర్ పాఠశాలలో అక్షయపాత్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్3,ప్రభాతవార్త:** అక్షయపాత్ర సేవలు మరువలేనివి అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.అక్షయపాత్ర ఫౌండేషన్ భారతదేశంలో సేవలందిస్తున్న ప్రముఖ లాభాపేక్షలేని సంస్థ ఇది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులుళఆకలి వల్ల చదువుకు దూరం కాకుండా పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించటం ఈ అక్షయపాత్ర ఈ సంస్థ ముఖ్య లక్ష్యం.మహబూబ్‌నగర్ నియోజకవర్గం హన్వాడ మండలంలోని వేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన స్వయంగా విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పారిశ్రామిక గోనెల శ్రీనివాసులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ,హన్వాడ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వి మహేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైత్రి యాదయ్య,మహిళా అధ్యక్షురాలు నవనీత, కార్యనిర్వాహక అధ్యక్షులు చెన్నయ్య,రఘుదాసరి, ఎంఇఓ గోపాల్‌నాయక్ మరియు అక్షయ పాత్ర ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**శివ మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు**

మహబూబ్‌నగర్ నగరంలోని పద్మావతి కాలనీ అయ్యప్ప కొండపై కొలువైన శివ మార్కండేయ స్వామి దేవాలయంలో ఆరవ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేదమంత్రాల మధ్య ఎమ్మెల్యేకి వేద ఆశీర్వాదం అందించడంతో పాటు తీర్థప్రసాదాలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ శివ మార్కండేయ స్వామి ఆశీస్సులు మహబూబ్‌నగర్ ప్రజలందరి పైన ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. దేవాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శాంతి, ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఇక్కడికి వచ్చిన ప్రతిఒక్కరికీ స్వామివారి అనుగ్రహం కలగాలి అని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తిరుమల వెంకటేష్, దేవాలయ కమిటీ సభ్యులు పల్లాటి బాలరాజ్, దాసు వెంకటేష్,వెంకటేష్ , సుకుమార్, పద్మనాభుడు, బిజ్జా శంకర్, పల్నాటి బుచ్చన్న, బి.నాగరాజు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



తిర్మలాపూర్‌లో వరి, మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

### దోపిడీని నియంత్రించేందుకే

## కొనుగోలు కేంద్రాలు

### ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

### తిర్మలాపూర్‌లో వరి, మక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**రాజాపూర్, నవంబరు 3 ప్రభాతవార్త:** రైతులు పండించిన పంటను దళారులు లేకుండా విక్రయించేందుకే కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఏర్పాటు చేస్తున్నామని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం రాజాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామంలో వరి, మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వారికి ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయిస్తే వారికి మధ్యవర్తిత్వం లేకుండా పండించిన పంటకు మంచి ధర వస్తుందన్నారు. రైతులు విక్రయించిన – మిగతా4లో..

# చేప పిల్లల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా జరగాలి

**నారాయణపేట,నవంబరు 3 ప్రభాతవార్త :** రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో చేప పిల్లల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. చేప పిల్లలు చెరువులకు సకాలంలో చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రూ.122.22 కోట్ల వ్యయంతో 83 కోట్ల చేప పిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలను 26,357 నీటి వనరులలో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నవంబర్ 20 నాటికి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. చేపల పంపిణీ ఆలస్యం అవుతున్న జిల్లాలు వెంటనే చర్యలు తీసుకోవాలని టీ మత్స్య యాప్‌లో సరఫరా వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి నీటి వనరులో విడుదలైన చేప పిల్లల వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. చేపల పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించి మత్స్య, నీటిపారుదల వ్యవసాయ పంచాయతీ శాఖల అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా లక్ష్యం 80.31 లక్షలలో ఇప్పటివరకు 61 ట్యాంకుల్లో చేప పిల్లల పంపిణీ పూర్తయిందని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, జిల్లా మత్స్య శాఖ అధికారి రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

**చేప పిల్లలను లక్ష్యం మేర పెంచేందుకు సకాలంలో చెరువుల్లో వదలాలి**

### ఉమ్మడి జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌లతో మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

**గద్వాల టౌన్ నవంబర్ 3, ప్రభాతవార్త:** జిల్లాలో చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు, లక్ష్యం మేర చెరువుల్లో చేప పిల్లలను సకాలంలో వదులుతున్నట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, ఇతర జలాశయాల్లో చేప పిల్లలను వదిలే కార్యక్రమం పై సోమవారం హైదరాబాద్ నుంచి మత్స్యశాఖ ప్రత్యేక కార్యదర్శి సవ్యసాచి ఘోష్, డైరెక్టర్ నిఖిలతో కలిసి రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్ని జిల్లాల కలెక్టర్లు, మత్స్యశాఖ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ సీజన్లో 7లక్షల మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి లక్ష్యంగా వీటి పెంపకానికి రూ.123 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటికే చేప పిల్లల కొనుగోలుకు టెండర్ ప్రక్రియ పూర్తయిన కొన్ని జిల్లాల్లో చేప పిల్లలను చెరువుల్లో వదులుతున్న ట్లు చెప్పారు. మిగతా జిల్లాల్లోనూ ఈ కార్యక్రమం ఈనెల 20 లోగా పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మాంసాహారంలో చేపలు తినే వారి సంఖ్య పెరగాలంటే ప్రజలకు వీటి ప్రయోజనం గురించి పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జూరాల వంటి జలాశయాల వద్ద చేపల స్టాల్స్, ఐస్ ప్లాంట్స్ ఏర్పాటుచేసి ఆక్వా కల్చర్ అభివృద్ధి చేస్తే స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి అన్నారు. ఆయా జిల్లాల్లోని స్థానిక శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత మత్స్యకార సంఘాల అధ్యక్షులను చేప పిల్లలను నీటిలో వదిలే కార్యక్రమంలో పాలుపంచుకునేలా అధికారులు నిబంధనల ప్రకారం పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే చేప పిల్లలను చెరువుల్లో వదిలి రాష్ట్రంలోనే ముందున్నామని తెలిపారు. జిల్లాలో సుమారు రూ.2.50 కోట్ల నిధులతో 1.90 కోట్ల చేప పిల్లలను ఆయా చెరువుల్లో వదులుతున్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 375 చెరువులు ఉండగా –మిగతా4లో..



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డా.వినీత్

## అంతర్ రాష్ట్ర గంజాయి సరఫరా చేస్తున్న ముఠా అరెస్టు

**నారాయణ పేట, నవంబరు 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పోలీసుల ప్రత్యేక చర్యలో భాగంగా గంజాయి సరఫరా చేస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాను అరెస్టు చేసి,12.4 కిలోల గంజాయి,రూ. 10,000 నగదు,10 మొబైల్ ఫోన్లు, 2 మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులుగా 10 మందిని గుర్తించి రిమాండ్‌కు తరలించారని జిల్లాఎస్పీ డా.వినీత్ తెలిపారు.కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో నవంబర్ 2న మధ్యాహ్నం 3 గంటలకు – మిగతా4లో..

# ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

**నవాబుపేట, నవంబరు 3 ప్రభాతవార్త :** మండల పరిధిలోని లోకిరేవు నుండి రేకుల చౌడపూర్ వయా రాజాపూర్ వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలు రోడ్డుకు మూడు ఫీట్ల ఎత్తులోనే వైర్లు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. కొత్తగా బీటి రోడ్డు వేయడంతో విద్యుత్ తీగలు వంగి ఉండడంతో తీగలు బీటీ రోడ్డుపైనే వేలాడి మేకలు, ఆవులు పాడి పశువులు ప్రజలు ఆదమరిచి వెళితే అనంత లోకాలకు వెళ్లాల్సిందే అన్నట్టుగా హై వోల్టేజ్ వైర్లు భూమికి అతి దగ్గరగా



మనుషులకు తగిలే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లు

వ్యవసాయ పనులకు వాహనదారులకు పాదచారులకు ఆటంకం కలిగించే అవకాశం ఉంది. దొడ్లపల్లి నుండి నవాబుపేట వరకు నూతనంగా నిర్మిస్తున్న డబల్ రోడ్డు పైన నిత్యం రైతులు అధికారులు తిరిగే రోడ్డుపైన చేతికి అందేలా విద్యుత్ తీగలు ఉండడంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని రైతులు పంట పొలాల్లో పనులు చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రాణాలు పోతున్న పట్టించుకునేలా లేరని మొన్న జరిగిన ఎనమనగండ్ల యువకుడు జగదీష్ విద్యుద్ఘాతానికి గురై మరణించిన సంగతి తెలిసిందే. అయినా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగానే ఉన్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రైతులకు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు అపాయము జరగకముందే నేలకు అతి సమీపంలో ఉన్న వైర్లను సరైన స్థితిలో పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

## మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా

**ఆత్మకూర్ నవంబర్ 3, ప్రభాతవార్త :** దేశానికి అన్నం పెట్టే రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా అన్నారు. రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు సోమవారం రోజు ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని



జూరాల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆత్మకూరు మండలంలో గల ప్రియదర్శి జూరాల ప్రాజెక్టు మరియు రామన్ పార్ట్ బ్యాలెన్స్ రిజర్వాయర్ ద్వారా సాగునీటి సౌకర్యం ఉన్న నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేసిన వెంటనే స్పందించి ఆయకట్టు ప్రాంతాల గ్రామాలలో తక్షణమే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజలు కొనేందుకు రాస ప్రభుత్వం సిద్ధంగా ఉందని అంతేకాకుండా సన్నరకం వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ తక్షణమే చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ పిఎసిఎస్ చైర్మన్ గాడి కృష్ణమూర్తి మాజీ ఎంపీపీ బారాస నాయకులు ఆర్ వీరేశలింగం, ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ మక్తల్ నియోజకవర్గం మాజీ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ ఆత్మకూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నలగొండ శ్రీనివాసులు కాంగ్రెస్ నాయకులు మహమూద్, బుచ్చన్న, సింగిల్ విండో డైరెక్టర్ రాములు తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం చేపట్టిన పశువుల సంరక్షణ

# అభివృద్ధి కొరకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

**వడ్డేపల్లి, నవంబరు 3 ప్రభాతవార్త :** గ్రామాల్లో పశువులు, రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని కృషి చేస్తోందని మండల పశువైద్యురాలు డా. స్వరూప రాణి తెలిపారు. పశు వైద్య పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం వడ్డేపల్లి మండలం తుమ్మాజిపల్లి లో మొదటి రోజు పశువులకు గాలి కుంటూ వ్యాధి నివారణ టీకాలు చేశారు. 35 మంది రైతులకు లబ్ది చేకూరింది. ఆవులు, ఎద్దులు, కోడెలు, దూడలు 118, గేదెలు, దూడలు 128, మొత్తం 246 పశువులకు ముందస్తుగా టీకాల టీకాలు చేసారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగు పడాలని ఉచితంగా అన్ని రకాల ప్రాణాంతక వ్యాధుల నివారణకు పశువుల కు టీకాలు సరఫరా చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో టీకాలు చేయడానికి వచ్చే పశు వైద్య సిబ్బందికీ సహకరించి, పశువుల టీకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి వీఎల్‌వో వర ప్రసాద్, ఎల్ఎస్‌ఏ షక్ లతీఫ్, ఆఫీస్ సహాయ సిబ్బంది వెంకటమ్మ, కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శివలింగం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

**ధన్వాడ, నవంబరు 3 ప్రభాతవార్త :** భక్తి పరవశంతో గున్ముక్ల గ్రామం సోమవారం శివమయంగా మారింది. ధన్వాడ మండలంలోని గున్ముక్ల గ్రామంలో కడపరాయ దేవాలయ ప్రాంగణంలో నిర్మించిన నూతన శివాలయంలో శివలింగం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం వేద మంత్రోచ్చారణల నడుమ అట్టహాసంగా జరిగింది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని మహాదేవుని ఆశీర్వాదం పొందారు. ఉదయం నుంచే వేద పండితుల వేదఘోషలతో ఆలయ పరిసరం మార్మోగింది. పూజా కార్యక్రమాలు, హోమాలు, అభిషేకాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించబడ్డాయి. రూ. 30 లక్షల వ్యయంతో



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన జరుగుతున్న దృశ్యం

నిర్మించిన ఈ ఆలయం గ్రామానికి ఆధ్యాత్మిక కేంద్రంగా మారబోతోందని నిర్వాహకులు తెలిపారు. ప్రతిష్ఠాపన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఘనంగా చేపట్టి వందలాది మంది భక్తులకు భోజనం వడ్డించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలోని మహిళలకు నూతన వస్త్రాలను కుటుంబ సభ్యులు అందజేయడం విశేషంగా నిలిచింది. గ్రామస్తులు, దాతలు, భక్తులు అందరూ కలసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో గున్ముక్ల గ్రామం పుణ్యక్షేత్ర వాతావరణంలో తేలిపోయింది. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు బాలయ్య గౌడ్, నర్సింహా రెడ్డి, కృష్ణయ్య, నర్సిములు, పూజారి నాగార్జున, యువకులు, గ్రామపెద్దలు మహిళలు పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి రూ.50 వేల

# ఆర్థిక సహాయం అందించిన బండారి నర్సప్ప

**మక్తల్ టౌన్, నవంబరు 3 ప్రభాతవార్త:** చిట్యాల గ్రామానికి చెందిన ఇందు అనే నిరుపేద అమ్మాయి ఎంబిబిఎస్ సీటు పొందినప్పటికీ డబ్బులేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని పుడమి ఫౌండేషన్, అంబేద్కర్ యువజన సంఘం, వారు నర్సప్ప టీచర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి ఆదివారం చిట్యాల గ్రామంలో నివసిస్తున్న ఇందు కుటుంబాన్ని కలిసిన బండారి నర్సప్ప టీచర్ రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని వారికి అందించారు. ఈ సందర్భంగా నర్సప్ప టీచర్ మాట్లాడుతూ పేద విద్యార్థులు డబ్బులు లేని కారణంగా



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఉన్నత చదువులు మధ్యలోనే వదిలేయవద్దనే ఉద్దేశంతోనే నా వంతుగా ఆర్థిక సహాయాన్ని అందించానని,మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థిని ఇందు ను ఆదుకోవాలని కోరారు. ఉన్నత చదువులు మాత్రమే సమాజంలో అణగారిన వర్గాలను ఆత్మగౌరవంగా నిలబడుతుందని అన్నారు. భవిష్యత్తులో ఇందు మంచిగా చదువుకొని సమాజంలో ఆదర్శంగా నిలబడుతూ, మరెంతోమంది పేదలకు సేవచేయాలని అన్నారు. ఇందు కుటుంబ సభ్యుల మాట్లాడుతూ తమ పాప చదువు కోసం ఆర్థిక సహాయం చేసిన నర్సప్ప టీచర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి మానమద్దిలేటి మానవ హక్కుల కార్యకర్త పృథ్వీరాజ్ ,మక్తల్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులువేంకటపతి రాజు, పుడమి ఫౌండేషన్ చైర్మన్ వై.చంద్రశేఖర్, డిటిఎఫ్ రవికుమార్ కర్నీ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, చిట్యాల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక నిఘా

**పోలీస్ శునకాల ద్వారా మాదక ద్రవ్యాలను గుర్తించేందుకు ప్రతి చోట తనిఖీలు**

**గంజాయి సాగు పై వ్యవసాయ విస్తర్ణాధికారుల ప్రత్యేక దృష్టి సారించాలి**

**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్**

**డిఎస్పీ వెంకటేశ్వర్లు**



నార్కోటిక్ కమిటీ సమన్వయ సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్, డిఎస్పీ

**వనపర్తి, నవంబరు 3 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా సంబంధిత శాఖల అధికారులు పనిచేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి నార్కోటిక్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న గంజాయి రవాణా, గంజాయి సాగు కేసులు, మాదక ద్రవ్యాలు వాడుతున్న వారి కేసులపై ఆరా తీయగా డిఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు తెలిపారు. 2025 సంవత్సరంలో ఇప్పటివరకు ఎనిమిది కేసులు నమోదైనట్లు తెలిపారు. స్పందించిన అదనపు కలెక్టర్ జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు ఉత్పత్తి చేయడం కానీ వినియోగించడం కానీ జరుగకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని సూచించారు. గంజాయి సాగు పై వ్యవసాయ విస్తర్ణాధికారుల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సాగును గుర్తించాల్సిన బాధ్యత ఏ.ఈ.ఒల పై ఉందన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో యాంటి డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మాదక ద్రవ్యాలు వినియోగించే వారిపై, సరఫరా చేసే వారిపై, గంజాయి పండించే వారిపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటీవల శిక్షణ పొంది నపోలీస్ శునకాల ద్వారా మాదక ద్రవ్యాలను గుర్తించేందుకు అనుమానం ఉన్న ప్రతి చోట తనిఖీలు చేయాలన్నారు. అదేవిధంగా జిల్లాలోని కల్లు దుకాణాలపై నిఘా ఉంచాలని, మైనర్లకు చిన్న పిల్లలకు కల్లు ఇవ్వకుండా దుకాణదారులకు సూచన చేయాలన్నారు. కల్లు లో అల్ప్రాజోలం అనే మత్తు పదార్థం వినియోగాన్ని కట్టడి చేయాలన్నారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తే జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దగలమని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ కలెక్టర్లు శ్రావ్య, రంజిత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు వాహనాల పార్కింగ్ షెడ్ నిర్మాణం పనులు

**పోలీసు వాహనాల భద్రత,**

**సిబ్బందికి సౌకర్యవంతమైన వాతావరణం**

**ఆధునిక సదుపాయాలతో పోలీసుశాఖకు కొత్త రూపు**

**సిబ్బందికి సౌకర్యాలు ప్రాధాన్యం**

**నిర్మాణం పనులను పరిశీలించిన ఎస్పి**

**వనపర్తి, నవంబరు 3, ప్రభాతవార్త:** సోమవారం వనపర్తి జిల్లా సాయుధ దళ పోలీస్ కార్యాలయం ప్రక్కన పోలీసు వాహనాల నిల్వ, సంరక్షణ కోసం నిర్మిస్తున్న పార్కింగ్ షెడ్ పనులను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి షెడ్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, అధికారులతో సమగ్ర చర్చ నిర్వహించారు. వాహనాల సౌకర్యవంతమైన పార్కింగ్, భద్రతా ప్రమాణాలు, వర్షాకాలంలో రక్షణపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్పి సూచించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమయానికి, సమర్థంగా ప్రజలకు సేవ చేయాలంటే వారికి మౌలిక వసతులు ఉండాలి. వాహనాల సంరక్షణ, భద్రతకు అనువైన పార్కింగ్ షెడ్ నిర్మాణం పోలీస్ శాఖ ఆధునీకరణ దిశగా ఒక ముఖ్యమైన అడుగు. ప్రతి సిబ్బంది సౌకర్యం, భద్రత మా బాధ్యత. పోలీస్ శాఖ అభివృద్ధి అంటే ప్రజా సేవకు బలమైన పునాది.పోలీసు శాఖలో సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడం మా ప్రధాన లక్ష్యం. వాహనాల సంరక్షణ, భద్రతా ప్రమాణాలు, సమయానికి మరమ్మత్తులు జరగడం వలన విధుల్లో ప్రతిస్పందన వేగం పెరుగుతుంది. ఆధునిక సౌకర్యాలతో వాహనాల షెడ్ నిర్మాణం వల్ల సిబ్బందికి పని భారం తగ్గి, ఆపరేషనల్ సామర్థ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి**

**అడ్డాకుల, నవంబరు 3 ప్రభాతవార్త:** మండల పరిధిలోని శాఖపూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో రాచాలలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను దేవరకద్ర ఎమ్మె ల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని తెలిపారు గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు రూ. 2 వేల 389లు, సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2 వేల 369లు మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించింది. సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500లు అదనంగా అందించనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పారిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని, ధాన్యం తడవకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతుల తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారులు, సింగిల్ విండో డైరెక్టర్లు, సీఈఓ మండల వ్యవసాయ అధికారులు, మండల తహసిల్దార్, మండల అధికారులు మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

# ఆయిల్ ఫామ్ పంటపై అవగాహన కార్యక్రమం

**నారాయణ పేట, నవంబరు 3 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా జాజాపురం గ్రామ రైతు వేదికలో జిల్లా కో ఆపరేటివ్ విభాగం ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ ఫామ్ పంటపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ ఉద్యాన శాఖ డీడీ సాయిబాబా జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, ఆయిల్‌ఫామ్ జిల్లా అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు. డీడీ సాయిబాబా మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంట ఒక్కసారి నాటితే 3035 సంవత్సరాలపాటు దిగుబడి ఇచ్చే గ్యారంటీ పంట అని తెలిపారు. అంతర పంటల ద్వారా రైతులు అదనపు లాభాలు పొందవచ్చని చెప్పారు. ప్రభుత్వం బిందు సేద్యం పద్ధతిలో ఎస్సీలకు 100 , బీసీలకు 90, ఓసీలకు 80 సబ్సిడీ అందజేస్తోందని తెలిపారు. ఆయిల్‌ఫామ్ అధికారి సత్యనారాయణ



ఆయిల్ పామ్ పంటపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మాట్లాడుతూ త్వరలో ఈ ప్రాంతంలోనే ఫ్యాక్టరీ ప్రారంభం కానుందని, రైతులు అందించే గెలల డబ్బులు రెండు రోజుల్లో అకౌంట్‌లలో జమవుతాయని తెలిపారు. జిల్లా సహకార సంఘం అధికారి ఆంజనేయులు రైతులకు రుణ సదుపాయాలు అందజేసి ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పారు. జాన్ సుధాకర్ రైతులు తమ పేర్లు నమోదు చేసుకొని రాయితీలు యంత్ర పరికరాల ప్రయోజనాలు పొందాలని సూచించారు. డీడీ సాయిబాబా మాట్లాడుతూ కూరగాయల సాగు కోసం ఉచిత నార్లు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు వెంకోబా, ఆకుల వెంకటప్ప, టంగు విశ్వనాథ్ తదితరులు పాల్గొని త్వరలో జాజాపురంలో ఎఫ్‌పీఓ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సూర్యకాంత్, ఉట్కూర్ శ్రీనివాస్, కోట్ల ప్రతాపరెడ్డి, 100 మంది రైతులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారం కొరకు స్పెషల్ లోక్ ఆదాలత్

**కక్షిదారులు ఈ స్పెషల్ లోక్ అదాలత్ ని సద్వినియోగం చేసుకోవాలి డీఎస్పీ వెంకటేశ్వరరావు**

**వనపర్తి క్రైమ్, నవంబరు3 ప్రభాతవార్త:** కోర్టులలో పెండింగ్‌లో వున్నా కేసులపరిష్కారం కొరకు స్పెషల్ లోక్అదాలత్. సోమవారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులు,జిల్లాడిప్యూటీ సూపరింటెండెంట్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా వున్న అన్ని కోర్టులలో పెండింగ్‌లో వున్నా క్రిమినల్ కేసులు,చెక్కు బౌన్స్ కేసులు,మైంటెనెన్సు కేసులు,గృహహింస చట్టం క్రింద నమోదైన కేసులు, ప్రమాద భీమా క్లెయిమ్ కేసులు, సివిల్ కేసుల పరిష్కారం కొరకు స్పెషల్ లోక్అదాలత్ ఈ నెల 15.11. 2025నాడు నిర్వహించడం జరుగుతుంది అని కావున కక్షిదారులు ఈస్పెషల్ లోక్అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు.



సమావేశంలో పాల్గొన్న డిఎస్పీ వెంకటేశ్వరరావు

ఈ స్పెషల్ లోక్అదాలత్‌ని జిల్లాన్యాయ సేవా అధికార సంస్థలను మండల న్యాయ సేవా సమితులను తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ నిర్వహించమని ఆదేశించటం జరిగిందని వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, వనపర్తి కోర్టులలో పెండింగ్ లో వున్నా కేసులను విభాగల వారీగా విభజించి వాటిలో రాజీకి అనుకూలంగా వున్నా కేసులను గుర్తించడం జరిగిందని వి. రజని, జిల్లా కార్యదర్శి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వనపర్తి తెలియజేశారు. ఈ స్పెషల్ లోక్ అదాలత్‌లో మధ్య వర్తిత్తం ద్వారా కూడా కేసుల పరిష్కారం కొరకు, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రత్యేకగా నియమించిన మధ్యవర్తుల ద్వారా కేసులలో వున్న కక్షిదారులతో మాట్లాడి పరిష్కారం కొరకు కృషి చేస్తారని తెలిపారు. మధ్యవర్తిత్వం అనేది ఇరుపక్షాలు వారి కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవటానికి వేగవంతమైన తక్కువ ఖర్చుతో కూడుకున్నదని, ఇందులో ఇరు వర్గాలకు విజయం వర్తిస్తుందని డాక్యుమెంట్స్ సుదీర్ఘ కోర్టు పోరాటాలు ఉండవని ఇరువర్గాలు మాత్రమే మాట్లాడుతారు కానీ వారి ప్రతినిధులు కారని, ఇరు పార్టీల సమ్మతితోనే పరిష్కారం జరుగుతుందని తెలియజేశారు. ఈ స్పెషల్ లోక్ అదాలత్‌లో భాగంగా గుర్తించబడిన కేసులలో ఇరువర్గాలకు నోటీసులని పంపించి లోక్ అదాలత్ ఎదుట హాజరు కమ్మని తెలియజేయడం జరుగుతుందని, కావున కక్షిదారులు ఈ స్పెషల్ లోక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ స్పెషల్ లోక్ అదాలత్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వనపర్తి ఆధ్వర్యంలో జరుగుతుందని, వీటిలో వైవాహిక వివాదాలు, వినియోగదారుల వివాదాలు, ఆస్తి విభజన వివాదాలు, భూమికి సంబంధించిన వివాదాలు, కుటుంబ వివాదాలు, రాజీకి పరిష్కార యోగ్యమైన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలియజేశారు. ఈ విధంగా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకున్నట్లయితే, ఎలాంటి కోర్టు ఖర్చులు ఉండదని అందరికీ ఆమోదంగా త్వరితగతిన కేసులు పరిష్కారం అవుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రజని, సీనియర్ సివిల్ జడ్జ్ కార్యదర్శి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, వనపర్తి, కార్తీక్ రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి, డిఎస్పీ వెంకటేశ్వరావు, పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# మదాసి కుర్వలకు ఎస్సీ కుల ధృవీకరణ ఇవ్వొద్దని ఫిర్యాదు

## అదనపు కలెక్టర్‌కు అంబేద్కర్ సంఘం వినతి




వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**ఊట్కూర్, నవంబరు 3 ప్రభాతవార్త :** మాదాసి కుర్వలకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయొద్దని అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో బీసీ వర్గానికి చెందిన మదాసి కుర్వలు అన్ని రకాల ప్రభుత్వ పథకాల లబ్ధి పొందారని, తెలంగాణ రాష్ట్రంలో మదాసి కుర్వలు అనే వర్గం లేదని ఫిర్యాదుదారులు వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించి, ఫిర్యాదును పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉట్కూర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొక్కు శంకర్, ప్రధాన కార్యదర్శి కొండన్ భరత్, ఉపాధ్యక్షుడు భక్కి తిమ్మప్ప, నాయకులు కథల పొల్ల తిమ్మప్ప, యువ నాయకులు నాగరాజ్ తల్వార్ తదితరులు పాల్గొన్నారు.

# సాక్షి స్పెల్ బి పోటీ పరీక్షలు

**అడ్డాకుల, నవంబరు 3 ప్రభాతవార్త :** వెల్టూరు లీడర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో సోమవారం నాడు ప్రిన్సిపల్ వెంకటేష్ గారి ఆధ్వర్యంలో సాక్షి స్పెల్‌బి పరీక్షలు1 నుండి 7వ తరగతి విద్యార్థులకు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేష్ మాట్లాడుతూ సాక్షి స్పెల్ బి పరీక్షలు నాలుగు దశలు నిర్వహిస్తారు మొదటి దశ పరీక్షలు నిర్వహించడం జరిగింది. సాక్షి స్పెల్ బి పోటీ పరీక్షల ద్వారా విద్యార్థులకు స్పెల్లింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం విద్యార్థుల పదజాలాన్ని మెరుగు పరుచుకోవడం ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడం, ఆంగ్ల ఉచ్చారణలో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడానికి ఉద్దేశించబడినది. విద్యార్థులకు స్పెల్ బి పోటీ పరీక్షలు ఒక మంచి మార్గమని తెలిపారు. కరస్పాండెంట్ విష్ణువర్ధన్ సాగర్, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు పరచాలి

**ఖిల్లా గణపురం నవంబర్ 3, ప్రభాతవార్త:** బీసీలకు విద్యా ఉద్యోగ స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఓబిసి జిల్లా కార్యదర్శి బెన్నూరు ఆశన్న ఆధ్వర్యంలో బీసీ నాయకులు మండల తహసిల్దార్ సుగుణకు కు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా రిజర్వేషన్ల అమలు సాధన సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్టు బీసీ నాయకులు తెలిపారు. రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాలలో బీసీడీలు అమలు పరచాలని అఖిలపక్ష ఆధ్వర్యంలో అన్ని పార్టీలు కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, కాగితాల మధు, శేఖర్ జయ బాబు శ్రీనివాసులు కుమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూర్ ఎస్సైగా జయన్న

**ఆత్మకూర్ నవంబర్ 3, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు మండల సబ్ ఇన్స్పెక్టర్గా జయన్న సోమవారం రోజు బాధ్యతల స్వీకరించారు. ఆత్మకూర్ ఎస్సైగా పనిచేస్తున్న టువంటి నరేందర్ వనపర్తి పట్టణానికి బదిలీ కాగా వనపర్తి లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జయన్న ఆత్మకూరు పట్టణానికి బదిలీ కావడంతో సోమవారం రోజు పట్టణంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ప్రధానంగా సైబర్ క్రైమ్ బారిన పడుతున్న యువతను చైతన్యపరిచేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.



# ప్రజావాణికి 48 ఫిర్యాదులు స్వీకరణ

**నారాయణ పేట, నవంబరు 3 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 48 ఫిర్యాదులు వచ్చాయి. అన్ని జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించారు. స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను సావధానంగా విన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకుని తక్షణమే పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను శాఖల వారిగా పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు



శ్రీకురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు చేస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ (చిన్నచింతకుంట), నవంబరు3 ప్రభాతవార్త:** తిరుమల తిరుపతికి ప్రతిరూపమైన శ్రీకురుమూర్తి స్వామి బ్రహ్మోత్స వాల వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్స వాల సందర్భంగా మొదటి హుండిని సోమవారం లెక్కించారు. బ్రహ్మోత్స వాల సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి కాకుండా తెలంగాణ ప్రాంతజిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులుస్వామివారిని దర్శించుకున్న అనంతరం కానుకల రూపేనా స్వామి వారి హుండీలో వేసిన నగదును ఛైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్‌రఘునాథ్, పాలకమండలి సభ్యులసమక్షంలో లెక్కించగా రూ.28 లక్షల 70వేల 536లఆదాయం సమకూరిందని వారు తెలిపారు. గత బ్రహ్మోత్స వాల సందర్భంగా మొదటి హుండీని లెక్కించగా రూ.25 లక్షల54 వేల ఆదాయం రావడం జరిగిందని వారు తెలిపారు. ఈసారి రెండులక్షల పైగా అధికంగాఉండి ఆదాయంరావడం జరిగిందని వారు తెలిపారు. వర్షాల కారణంగా భక్తులురావడం తగ్గడంతో కొంతహుండీఆదాయం తగ్గిందని తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, అర్చకులు, సేవాసమితి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## పిఆర్సి ప్రకటించాలి లేదంటే ఉద్యమం తప్పదు



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర అధ్యక్షులు కానుగంటి హనుమంతరావు

**నారాయణపేట, నవంబరు3 ప్రభాతవార్త:** నారాయణపేటలో జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో తపస్ రాష్ట్ర అధ్యక్షులు కానుగంటి హనుమంతరావు మాట్లాడుతూ పిఆర్సి కాలపరిమితి ముగిసి రెండేళ్లకు పైగా గడిచినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రభుత్వం వెంటనే పిఆర్సి ప్రకటించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు ఎక్కువగా ఉన్నందున బోధన సహాయకులను వెంటనే నియమించాలని 2010 కంటే ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలనిడిమాండ్ చేశారు. అదే విధంగా సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలని ఉద్యోగుల హెల్త్ కార్డులను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. సర్వశిక్ష అభియాన్‌లో పనిచేసిన ఉద్యోగులకు సమ్మె కాల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు గుంపు బాలరాజ్, శ్రీనివాస్ గౌడ్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చేప పిల్లల పంపిణీ



చెరువులో చేప పిల్లలను వదులుతున్న అధికారులు

**మాగనూర్, నవంబరు3 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన వంద శాతం సబ్సిడీ ఉచిత చేప పిల్లలను సోమవారం మాగ నూర్ పెద్ద చెరువులో వదిలారు. చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నారాయ ణపేట జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు కాంత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనంద్, ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో డెభై ఎనిమిది వేల చేపపిల్లలను పంపిణీ చేశారు. మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రజా ప్రభుత్వం అండగా ఉండి, ఉచిత చేపపిల్లలను పంపిణీ చేసినందుకు ప్రభుత్వానికి మాగనూర్ మత్స్య కార్మిక సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పంచాయతీ సెక్రెటరీ తిమ్మప్ప, మత్స్య పరిశ్రమల సహకార సంఘం జిల్లా డైరెక్టర్ పుంజనూర్ ఆంజనేయులు, జిల్లా డైరెక్టర్ గేట్ హనుమంతు, ఫీల్డ్ ఆఫీసర్ వర్ధన్, అనిల్‌కుమార్, గ్రామ సొసైటీ ఉపాధ్యక్షులు దండుఆనంద్, కార్యదర్శి గడ్డంనరేష్, డైరెక్టర్‌లు దండు బస్వరాజ్, వర్క్యార్‌ఆంజనేయులు, వాకిటివెంకటయ్య, బులిమేని దేవప్ప, పుంజనూరు మహదేవ్ పాల్గొన్నారు.

## రాయికోడ్ కాట్రేవుపల్లి మట్టి రోడ్డు పనులు ప్రారంభం



మట్టి రోడ్డుపనులు ప్రారంభిస్తున్న దృశ్యం

**నర్వ, నవంబరు 3 ప్రభాతవార్త :** నర్వ మండలంలోని రాయికోడ్ గ్రామంలో రాయికోడ్ కాట్రేవుపల్లి రోడ్డు పనులను సోమవారం కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్, మండల నాయకులు ప్రారంభించారు. భారీగా కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిని రాకపోకలకు ఆటంకం కలగకుండా ఉండాలనే గ్రామస్తుల కోరిక మేరకు మంత్రి వాకిటి శ్రీహరి రూ. 3.30 లక్షల నిధులు కేటాయించడంతో పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు శరణ్, నియోజకవర్గ నాయకులు పుల్లరి ఆనంద్, వివేకవర్ధన్ రెడ్డి, మండల నాయకులు బి. వెంకటేష్, కుర్వ మహేష్ గౌడ్, ఆర్.అయ్యపు రెడ్డి, జి.సంజీవరెడ్డి, వై.జగదీశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు ఆంజనేయులుగౌడ్, ఖాజ మైనోద్దీన్, జబ్బార్, నారాయణరెడ్డి, ఘని, సత్యారెడ్డి, రసూల్, పి.రవి, పుల్లరి హన్మంతు, పి.రాజు, జంగిటి రాజారాం, గొల్ల చిన్న మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వరల్డ్‌కప్ విజేతగా భారత్

### సిపిఎస్ పాఠశాలలో సంబరాలు

**ఊట్కూర్, నవంబరు 3 ప్రభాతవార్త :** మొదటిసారిగా మహిళా క్రికెట్ వరల్డ్‌కప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు స్థానిక సిపిఎస్ పాఠశాలలో ఘనంగా అభినందనలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు గుర్నాథ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందోత్సా హాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్.ఎం గుర్నాథ్ మాట్లాడుతూ భారతీయ మహిళా క్రికెటర్లు దేశం గర్వించేలా అద్భుత ప్రదర్శన చేశారు. మహిళలు ఏ రంగంలోనూ తీసిపోకుండా దూసుకెళ్తున్నారు. మహిళా శక్తిని గుర్తించి ఉపయోగించుకున్న దేశాలే అగ్రస్థానాల్లో ఉంటాయి" అని పేర్కొన్నారు. హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో స్మృతి మంధన, షఫాలి వర్మ, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్ వంటి ఆటగాళ్లు అద్భుతంగా పోరాడి భారతదేశాన్ని ప్రపంచ వేదికపై గర్వించదగ్గ స్థాయిలో నిలబెట్టారని తెలిపారు. ఈ విజయం ప్రతి భారతీయ మహిళకు స్ఫూర్తినిస్తుందని, రానున్నరోజుల్లో మరెంతో మంది బాలికలు క్రీడల్లో ముందుకు రావాలని ఆయన ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, గోపాల్, శిరీష, అనిల్, స్వీపర్ వెంకటమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు

## చేప పిల్లల విడుదల ప్రక్రియ వేగవంతం చేయాలి

**రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**





వీసీలో మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి, పాల్గొన్న అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్

**వనపర్తి, నవంబరు 3 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రాన్ని చేపల ఉత్పత్తిలో దేశానికే ఆదర్శంగా నిలపడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, కాబట్టి అన్ని జిల్లాల్లో చేప పిల్లల విడుదల ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటిశ్రీహరి ఆదేశించారు. సోమవారం మంత్రి వాకిటి శ్రీహరి మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్, డైరెక్టర్ నిఖిలతో కలిసి రాష్ట్రంలో చేప పిల్లల విడుదల పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో, పారదర్శకంగా చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. నవంబర్ 20లోపు అన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యే విధంగా కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను ప్రారంభించాలని సూచించారు. ఇప్పటికే చేప పిల్లల విడుదల కార్యక్రమం ప్రారంభించిన జిల్లాల్లో వేగవంతం చేయాలని, ఇంకా ప్రారంభం కాని చోట త్వరితగతిన స్టార్ట్ చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రాన్ని చేపల ఉత్పత్తిలో దేశానికే ఆదర్శంగా నిలపడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. చేపపిల్లలను విడుదల చేసిన ప్రతి చెరువు, రిజర్వాయర్ వద్ద అన్ని వివరాలతోకూడిన బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్ రెవెన్యూ మాట్లాడుతూ త్వరలోనే నిబం ధనల ప్రకారం జిల్లాలో చేప పిల్లల విడుదల ప్రక్రియ చేపడతా మని తెలియజేశారు. సమావేశంలో మత్స్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతు పండించిన ప్రతి గింజ ప్రభుత్వం కొంటుంది

**-మధ్యదళారీల మాటలు నమ్మొద్దు**

**-భూత్పూర్‌లో వరికొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్**

**భూత్పూర్, నవంబర్ 3, ప్రభాతవార్త :** వర్షాలకు తడిసిన ధాన్యం పట్ల రైతులు అధైర్యపడొద్దని, రైతు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే జీఎంఆర్ సోమవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాన్ని, ఐకెపి మహిళల సారథ్యంలో కొనసాగుతున్న పోతులమడుగు, తాటికొండ గ్రామాలలో వరికొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భూత్పూర్ వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ వరికొనుగోలు విషయంలో కొందరు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, రైతులు మధ్యదళారీల మాటలను నమ్మకూడదని హితవు చెప్పారు. ఇటీవల కురిసినతుఫాన్ వర్షాలతో రైతులు ధాన్యం తడిసి నాణ్యత కోల్పోయిందని బెంగపడొద్దని, కొనుగోలు చేసిన మూడ్రోజుల్లో ప్రభుత్వం రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తుందన్నారు. ఇటీవల కురిసిన తుఫాన్ వల్ల నష్టపోయిన పంట నష్టం అంచనా వేసేందుకు సంబంధిత అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారన్నారు. సన్నాలకు బోనస్ విషయంలో కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, వీలైనంత వరకు సన్నాలకు క్వింటాల్‌కు రు.ఐదొంద ల బోనస్ అందించేందుకు చర్యలు తీసుకుందని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ పీఏసీఎస్ చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డితో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పద్మమ్మ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతి రెడ్డి, మండల కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు జైదు శ్రీనివాసులు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు లిక్కి విజయ్‌గౌడ్‌లతోపాటు తహసిల్దార్ కిషన్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్, మండల వ్యవసాయాధికారి మురళిధర్, పీఏసీఎస్ సీఈఓ రత్నం, సింగిల్ డైరెక్టర్ గడ్డం రాములు ఇతర కాంగ్రెస్ నాయకులు బోరింగ్ నర్సింహులు, ఆగిరి రవి, మశ్చేందర్, గడ్డంఎల్లప్ప, మల్లేష్, తిరుపతి రెడ్డి, కెంద్యాల రాజేష్, మట్టి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం కృషి

**- రైతుల ప్రయోజనాల కోసం పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలి**

**- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**



రైతులు తీసుకొచ్చిన పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**ఊర్కొండ, నవంబర్ 3 ప్రభాతవార్త:** పత్తి రైతులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు పండించిన పత్తి తడిసిందని రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయకుండా ఇబ్బందులు కలిగిస్తే నేరుగా తనకు సమాచారమివ్వాలని ఎమ్మెల్యే రైతులకు భరోసానిచ్చారు. ఊర్కొండ మండలంలోని జగబోయిన్‌పల్లి గ్రామంలో ఉన్న మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రా న్ని సోమవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తి రైతుల సంక్షేమం కోసంప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. పత్తి పంటకు సరైన ధర లభించేలా, రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాలను సమయానికి ప్రారంభించామని అన్నారు. స్థానిక అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, మార్కెటింగ్ అధికారులు రైతులతో సమన్వయం చేసుకొని పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని సూచించారు. రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలద్వారా తమ పత్తిని విక్రయించి న్యాయమైన ధర పొందాలని సూచించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. పత్తి కొనుగోలు కేంద్ర ప్రారంభోత్స వానికి విచ్చేసిన ఎమ్మెల్యేను స్థానిక నాయకులు, రైతులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు అందిస్తున్న నాయకులు

**దేవరకద్ర, నవంబరు3 ప్రభాతవార్త:** రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మాలని కౌకుంట్ల మండల ప్రముఖ నాయకులు అన్నారు. సోమవారం దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి. అదేవిధంగా కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన 9 మందికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనందంలోలబ్ధిదారులు ఎన్నో ఏండ్ల సొంతింటి కలనెరవేరింది అంటూ ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ మంజూరు చేసిన దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన లబ్ధిదారులు. తదనంతరం కౌకుంట్ల మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి ృ, షాదీ ముబారక్, చెక్కులు పంపిణీ చేసిన రాఘవేందర్ రెడ్డి, అరవింద్ కుమార్ రెడ్డి, కిషన్ రావు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, సీఈఓ శ్రీనివాస్, ఏవో శివకుమార్, ఏఈవోలు, ఓబీసీ అధ్యక్షులు ఆంజనేయులు, యువజన అధ్యక్షులు నరేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మల నరసింహారెడ్డి, వడ్ల సురేంద్ర చారి, మన్నెపు రెడ్డి, ప్రభు, రవీందర్ రెడ్డి, వివిధ గ్రామాలముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఊట్కూర్‌కు పూర్తి స్థాయి రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**ఊట్కూర్, నవంబరు 3 ప్రభాతవార్త :** వికారాబాద్-కృష్ణ నూతన రైల్వే లైన్ డీపీఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)లో ఊట్కూరును కేవలం హాల్ట్ స్టేషన్‌గా కాకుండా, పూర్తి స్థాయి రైల్వే స్టేషన్‌గా ఏర్పాటు చేయాలని రైల్వే స్టేషన్ సాధన సమితి సభ్యులు మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ సాధన సమితి అధ్యక్షులు ఎం. భాస్కర్, కార్యదర్శులు అరవింద్, లక్ష్మారెడ్డి, సూర్య ప్రకాష్ రెడ్డి, కొక్కు లింగం, ఆర్‌ఎంపి రఘు, దొబ్బలి హన్మంతు తదితరులు పాల్గొన్నారు. వారంతా ఊట్కూర్ ప్రజలకు రైల్వే స్టేషన్ అవసరం ఎంతో కీలకమని, ప్రయాణ సౌకర్యాలు, వ్యాపారాభివృద్ధి దృష్ట్యా ఈ డిమాండ్‌ను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, ఊట్కూర్ రైల్వే స్టేషన్ అంశాన్ని నేను సీరియస్‌గా తీసుకుంటాను. కేంద్ర రైల్వే శాఖతో చర్చించి, ఊట్కూర్ ప్రజల అభ్యర్థన నెరవేరేలా కృషి చేస్తాను" అని హామీ ఇచ్చారు. అంతేకాక, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కొనసాగాలని, ఊట్కూర్‌ను ప్రతి విధంగానూ ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

## 42 శాతం బీసీల రిజర్వేషన్ సాధించేవరకు పోరాటం చేస్తాం

**అఖిల పక్షం నాయకులు**

**అయిజ నవంబర్ 3, ప్రభాతవార్త;** రాష్ట్రంలో 42శాతం బీసీ రిజర్వేషన్ పూర్తిస్థాయిలో అమలయం వరకు పోరాటం చేస్తామని మండల అఖిలపక్ష నాయకులు, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి సభ్యులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల తాసిల్దార్ కార్యాలయం ఆవరణలోతాసిల్దార్ జ్యోతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చడానికి సన్నద్ధం కావాలని ప్రభుత్వపరంగా రిజర్వేషన్ అమలు చేయడానికి మీనమేషాలు లెక్కిస్తున్న పాలకవర్గాలు తమ ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందని గ్రహించి ఇచ్చినట్టే ఇచ్చి తిరిగి యధాస్థితికి తీసుకురావాలని కుట్రలు పన్నుతున్నారని, ఈ కుట్రలను భగ్నం చేసి పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. జనాభాలో సుమారు 60శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడం సోషనీయమని ఆ రిజర్వేషన్లను కూడా అమలు చేయకపోవడం దుర్మార్గమని ప్రభుత్వం తాము ఇచ్చిన జీవోను అమలుపరచడానికి రాజ్యాంగపరంగా తీసుకోవలసిన చర్యలను తీసుకోవాలని ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వవలసిన బిజెపి ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసే దిశగా కదులుతున్నాయని బీసీలుతమ హక్కులను తమ భాగస్వామ్యాన్ని పోరాడి సాధించుకోవాలి ఎవరో బిచ్చం వేస్తే రిజర్వేషన్లు రావని ఐక మత్యంతో కదలాలని వారు కోరారు. 42శాతం రిజర్వేషన్లను అమలు చేయమని కోరుతూ ఇచ్చిన విన్నపాన్ని ప్రభుత్వానికి పంపాలని కోరారు. కార్యక్రమంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కురువ పల్లయ్య, జోష్‌రాజు, భరత్, కృష్ణరాజు, సునీల్ కుమార్, మైబు, నర్సింహులు, కృష్ణ, కిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు

**-అభినందించిన ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్**





విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 3 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ పట్టణంలోని బాలుర జిల్లాపరిషత్ మైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాకరాటే ఎస్.జి.ఎఫ్ అండర్ 14,17 పోటీలు నిర్వహించారు. ఈ కరాటే పోటీలో నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన కాకతీయ పాఠశాల విద్యార్థులు లక్ష్మి, నరసింహ, అండర్ 14, 55 కేజీ, అదేవిధంగా అనుదీప్ అండర్ 14,50 కేజీ విభాగంలో పాల్గొని చక్కటి ప్రతిభను కనబరచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఎంపికైనట్లు మాస్టర్ మహేష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ అభినందించారు. ఈ సందర్భంగా కరాటేలో ప్రతిభ కనబరిచిన కాకతీయ పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు మల్లికార్జున్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఇదే తరహాలో కష్టపడిఅనుకున్న లక్ష్యాలను సాధించి, చదువుకున్న పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ విద్యార్థులను కోరారు.

## ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలి



స్టేడియం లేకపోవడంతో ఉన్న స్థలంలోనే బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

**మద్దూరు, నవంబరు 3 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడాకారులు ఇండోర్ స్టేడియం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం, వేసవిలో మైదానం లభించక క్రీడాభ్యాసం దెబ్బతింటోందన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి మద్దూరులో ఆధునిక సదుపాయాలతో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని క్రీడాకారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, ముజీబ్, రహీం, జమీర్, దేవేందర్ గౌడ్, వినయ్, రుమండ్ల కృష్ణ, బాలరాజ్, అజిత్, దేవేందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగి జీవితంలో రిటైర్మెంట్ సహజం

**పదవీ విరమణ కార్యక్రమంలో ఎంఈఓ ఉషారాణి**

**భూత్పూర్, నవంబర్ 3, ప్రభాతవార్త :** భూత్పూర్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు సాహితీ విజయలక్ష్మి పదవీ విరమణ సన్మాన వీడ్కోలు సమావేశం సోమవారం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఆనందమ్మ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారిణి ఉషారాణి హాజర య్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గత 36ఏళ్లుగాఎంతో క్రమశిక్షణతో విజయలక్ష్మిఉపాధ్యాయురాలిగా పనిచేసి రాణించారని ఎంఈఓ ఉషారాణి అన్నారు. పదవీ విరమణ పొందుతున్న విజయలక్ష్మి దంపతుల్ని శాలువలు, గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం బైకాని బాలుయాదవ్, పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు సురేష్‌రెడ్డి, సాయి రామ్ రెడ్డి, ఉపాధ్యాయ యూనియన్ రాష్ట్ర నాయకురాలు రేవతి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్పాట్ అడ్మిషన్ ప్రారంభించాలి

**- పీయూలో ఎన్ఎస్‌యూఐ ధర్నా**

**మహబూబ్‌నగర్, నవంబర్3, ప్రభాతార్త:** పాలమూరు యూనివర్సిటీ లా కాలేజ్‌లో 42ఖాళీల సీట్లకు సంబంధించిన స్పాట్ అడ్మిషన్స్ ఇంకా విడుదల కాలేదని మహబూబ్‌నగర్ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలోధర్నా నిర్వహించారు. ఈ మేరకు మహ్మద్ అమీర్ సోహైల్, మహబూబ్‌నగర్ ఎన్ఎస్‌యూఐ, ప్రుధ్వినాథ్ రెడ్డి (టీమ్ రేవంత్) నేతృత్వంలో పాలమూరు యూనివర్సిటీ లా క్యాంపస్‌లో ఆందోళన నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ బృందం వైస్ ఛాన్సలర్ ను వెంటనే చర్యలు తీసుకోవాలని, అలాగే కౌన్సెలింగ్ కన్వీనర్ తో చర్చించిమిగిలినలా సీట్లకు సంబంధించిన స్పాట్ అడ్మిషన్ ప్రక్రియను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, ఇమాద్ బైగ్, సీనూ, విశాల్, అరఫాత్, జహీర్, సంతోష్ తదితరులు పాల్గొని తమ మద్దతును తెలియజేశారు.

## హరీష్‌రావును కలిసిన బిఆర్ఎస్ నాయకులు



**మద్దూరు, నవంబరు3 ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు హరీష్‌రావు తండ్రి గతవారం రోజుల క్రితం మరణించడంతో సోమ వారం రోజు మద్దూరు మండల బిఆర్ఎస్ మండల నాయకులు హరీష్‌రావుని కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, పార్టీ సీనియర్ నాయకులు నెల్లి రాములు, విఠల్, బసప్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక అంతర్జాతీయ సదస్సును జయప్రదం చేయండి

**టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం**

**అమరచింత నవంబర్3 ప్రభాతవార్త :** అంతర్జాతీయ ఆటోమేటివ్ వర్కర్స్ కాన్ఫరెన్స్ మూడవ సదస్సు మహారాష్ట్ర పూణేలో ఈనెల 20 నుండి 24వ తేదీ వరకు జరుగుతుందని టి యు సి ఐ రాష్ట్ర అధ్యక్షులు కే. సూర్యం పేర్కొన్నారు. సోమవారం అమరచింతలోని టియుసిఐ భవనంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలోని ఆటోమేటివ్ కార్మికులతో పాటు సైనిక ఆటోమేటివ్ కార్మికులందరిని, వారి కుటుంబాలనూ, ఇతర మద్దతుదారులను ఈ సదస్సులో పాల్గొనాలని మేము ఆహ్వానిస్తున్నాం. ఈ సదస్సు ఉద్దేశం ఆటో మరియు ఆటో విడిభాగాల పరిశ్రమలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆ పరిశ్రమ భవిష్యత్తు పరిణామాలను చర్చించడానికిఅంతర్జాతీయ వేదికగాఈ సదస్సు చర్చలు జరుపబోతున్నది. ఇది అంతర్జాతీయకార్మిక ఉద్యమాలనూ, పరస్పర అవగాహనా పెంచుకోవడానికి, సహకరించుకోవడానికి, అనుభవాల మార్పిడిని చేసుకోవడానికి ఈ మహాసభ తోడపడుతుంది. కనుక అంతర్జాతీయ కార్మికుల సమస్యల కలబోత, ఆటోమేటివ్ కార్మికుల సమస్యలు, ఉద్యమాల సమ్మేళనం, పరస్పరం సృజనాత్మకంగా కార్మికులనుఐక్యం చేయడానికిభవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకొని, ఉద్యమాన్ని విస్తరించడానికి చేపట్టిన అంతర్జాతీయ 3 వ ఆటోమేటివ్ కార్మికుల సదస్సును జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు సి హను మంతు, జిల్లా అధ్యక్షులు ప్రసాద్, ఉపాధ్యక్షులు సిరాజు, జిల్లా నాయకులుకురుమన్న కే.ప్రేమరత్నం, మాస్తామనిలు పాల్గొన్నారు.



# వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకూడదు : దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి**



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**దేవరకద్ర, నవంబరు 3 ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలిన్ కవర్లను అందుబాటులోఉంచాలని, రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మాలని దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి అన్నారు. సోమవారం దేవరకద్ర మండలం చౌదర్ పల్లి, నాగారం, గ్రామలలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ హనుమంత్ రెడ్డి, అగ్రికల్చర్ ఏఈఓరాజేష్, సరోజ సిసి వివోఏ రైతులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ గావినోళ్ల రాధ

**మక్తల్ టౌన్, నవంబరు 3 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని పారేవుల గ్రామంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని మక్తల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ గవినోళ్ల రాధమ్మ ప్రారంభించారు. వరికి మద్దతు ధరతో పాటు రూ. 500/ల బోనస్ కూడా ప్రజా ప్రభుత్వం అందజేస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి. గణేష్ కుమార్, మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ వాకిటి శేషగిరి, డైరెక్టర్లు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, శాలంబిన్ ఓమర్, ఫయాజుద్దీన్, ఏఈఓ విజయ్, మాజీ సర్పంచ్ మణివర్ధన్, రవీందర్ రెడ్డి, ఆంజనేయులు, వసంత్‌రెడ్డి, నాగరాజ్‌గౌడ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

**దామరగిద్ద, నవంబరు 3 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం అయ్యవారి పల్లి, కందెన్ పల్లి, చాకలోనిపల్లి, లోకుర్తి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం శివారెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో చిట్టెం మాధవ రెడ్డి, తహసిల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ సాయి లక్ష్మి ..., మండల కాంగ్రెస్ నాయకులు ఖాజామియా, జీకే వెంకటప్ప ఏఎంసీ డైరెక్టర్, బర్ల ఆనంద్, కె. వెంకటరామిరెడ్డి, తమ్మలి రఘు, నీలి మాణిక్యప్ప, ఆయా గ్రామ నాయకులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్న దృశ్యం



వరి కొనుగోలు కేంద్రాంను ప్రారంభించిన పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్

**అమరచింత నవంబర్3, ప్రభాతవార్త:** అమరచింత మండలంలోని పలు గ్రామాలలో సోమవారం ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. చంద్రఘడ్ గ్రామంలో ఐకెపి వరి కొనుగోలు కేంద్రం కాంగ్రెస్ పార్టీ అమరచింత పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి అని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఈర్లదిన్నె, నందిమల్ల, పామిరెడ్డిపల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఐకెపి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఐకెపి వరి కొనుగోలు కేంద్రాల వద్దనే వరి ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సంఘం ప్రతినిధులు. వ్యవసాయ అధికారి సీసీలు వివో ఏలు అన్వర్ పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కు ఇప్పించండి సారు..

### అదనపు కలెక్టర్‌కు వినతి



**నారాయణ పేట, నవంబరు 3 ప్రభాత వార్త :** నారాయణపేట జిల్లా కోటకొండ గ్రామానికి చెందిన నీలి తిరుపతమ్మ సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కి వినతిపత్రం అందజేశారు అప్పు చేసి తన కుమార్తె అనూష పెళ్లి చేశానని, కానీ కళ్యాణ లక్ష్మి చెక్కు బ్యాంకు డ్రా చేయడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘం లోన్ బాకీ పేరుతో బ్యాంకు మేనేజర్ చెక్కు నిలిపి వేశాడని తెలిపారు. 2023లో రూ.7.20 లక్షల లోన్‌లో కొంత మొత్తం తమ గ్రూప్ సభ్యులకి ఇవ్వగా మిగతా డబ్బులు గ్రామ వివోఏ కమ్మరి కృష్ణయ్య తీసుకుని తిరిగి చెల్లించలేదని ఆమె ఆరోపించారు. దీని ఫలితంగా తమ అకౌంట్లు బ్లాక్ అయ్యి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన అధికారిని విధుల నుండి తొలగించి కళ్యాణ లక్ష్మి చెక్కు డ్రా చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్‌ని వేడుకున్నారు.

## రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభం!

**నవాబుపేట, నవంబరు3 ప్రభాతవార్త :** రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభం ఉండటంతో గ్రామస్తులకు సిసి రోడ్డు వేసిన సంతోషం లేకుండా పోయింది. నవాబుపేట మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామస్తులు రైతులు కూలీలు ఆదివారం జరిగే సంతకు వేలల్లో నవాబుపేట గ్రామానికి అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలకు వాహనాలకు గ్రామస్తులకు మండల కేంద్రంలోని హనుమాన్ దేవస్థానం ముందు గల విద్యుత్ స్తంభం భారీ వాహనాలకు ఇతర వాహనాలకు అడ్డంకిగా మారింది. రోడ్డు వేసే ముందు విద్యుత్ స్తంభాలను పక్కకు జరిపి ప్రణాళిక బద్ధంగా పనులను చేపట్టాలి. కాని ఇక్కడ విద్యుత్ శాఖ గ్రామ అధికారుల మధ్య సమన్వయ లోపం వలన స్తంభాలను పక్కకు జరపకుండా అలాగే ఉంచి సీసీ రోడ్డు వేశారు. రోడ్డు విశాలంగా మారినా, మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని రోడ్డు పక్కకు ఉంచాలని కోరారు.



రోడ్డు మధ్యలో స్తంభం ఉన్న దృశ్యం

# ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

తనతో పాటు మంత్రులు అధికారంలో ఉండి కూడా ఈ ప్రాజెక్టు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. టన్నెల్ లోపల చేసే పని క్రిటికల్ సిట్యుయేషన్ నేపథ్యంలో అందరితో సర్వేలు చేస్తున్నామన్నారు. అటవీ ప్రాంతంలో టన్నెల్ చేయడం ఎంతో ఇబ్బంది అయినప్పటికీ తప్పకుండా పూర్తి చేసి తీరుతామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన హామీనిచ్చారు.

**రెండేండ్లలో పూర్తి చేసేలా.. : రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..ఈ పనులు 20 సంవత్సరాల నుంచి కొనసాగుతున్నా గత ఐదేళ్ళ క్రితం నుంచి ప్రారంభమయ్యాయి. అందరి దృఢ సంకల్పంతో రెండేళ్ళలో ఎస్ఎల్బీసీ టన్నెల్ పూర్తి చేయాలని ముందుకెళ్తున్నాం. ఈ టన్నెల్ పూర్తయితే శ్రీశైలం ప్రాజెక్టు కంటే ఎక్కువగా నీరు వచ్చి ఇబ్బందులు లేకుండా ఉంటుంది. అలాగే గతంలో ఎస్ఎల్బీసీ పనుల్లో ఎనిమిది మందిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యాధునికమైన హెలిబోన్ ఎలక్ట్రిక్ టెక్నాలజీ ద్వారా 44 కిలోమీటర్ల వరకు హెలీకాప్టర్ ద్వారానే జరుగుతుంది. భారత ఏరియల్ ఎలక్ట్రికల్ మ్యాగ్నెటిక్ సర్వే ఎక్కడా నిర్వహించలేదు. ఇక్కడే ప్రథమం..అడ్వాన్స్డ్ టెక్నాలజీతో తిరిగి ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులుపూర్తి చేయడం జరుగుతుంది. ఈ సర్వేకు టన్నెల్ కొలాప్స్ అయిన సమయంలో భారతదేశంలోనే టన్నెలింగ్ మెథడ్లో ఎక్కువ నైపుణ్యం ఉన్న వారిని ఎంచుకొని భారత సైన్యానికి ఇంజనీరింగ్ చీఫ్‌అయినజనరల్ హరిపాల్‌సింగ్, ఇండియన్‌ఆర్మీ ఆఫీసర్.. .ఎంతో పేరు ప్రఖ్యాతులుగాంచిన వారిని తెలంగాణకు డిప్యూటేషన్పై తీసుకొని ఈ పనులు నిర్వహించడం జరుగు తుందని తెలిపారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డివివరించారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎన్నో కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

**ఫ్లోరైడ్ నిర్మూలన : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వం వచ్చిన తర్వాత తానే ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రాజెక్టు ద్వారా నల్గొండ జిల్లాను ఫ్లోరైడ్ నుంచి కాపాడాలని ఎన్నోసార్లు మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో ఎస్ఎల్బీసీ గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అడగకుండానే ఈ ప్రాజెక్టుకు ఎంత ఖర్చయినా పూర్తి చేయాలని సంకల్పించారని ఇది ఆనందకరమన్నారు. మూడు లక్షల ఎకరాలతో పాటు ఫ్లోరైడ్ లేకుండా చేయడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. అప్పట్లో ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, అంజయ్యలు సైతంఈ విషయం గురించి పట్టించుకొన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ కార్యక్రమం వల్ల .. తాను ఇరిగేషన్ మంత్రిగా ఉండటం తనకు ఎంతో గర్వకారణమని తెలిపారు. వికారాబాద్ నుంచి ప్రారంభమయ్యే మూసీనది మంచిగా చేసేందుకు కూడా ఖర్చుకు



వెనకాడకుండా ప్రభుత్వం పని చేస్తుందని ఈ విషయంలో జిల్లా ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.

**అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ...** ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ నీటికి సంబంధించి ఈ మధ్యలో కురిసిన భారీ వర్షాలకు నల్లమల్ల అడవిలోని నక్కలమండలి రిజర్వాయర్లో మల్లాపాడు తండా, కేత్యా తండాలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చేపట్టాలని సభలో ముఖ్యమంత్రిని కోరారు. అదే సమయంలోవర్షాల వల్ల నష్టపోయిన తండావాసులకు నష్టపరిహారం అందించాలనిసభలో కోరారు. అనంతరం సర్వే నిర్వహించే ప్రత్యేక హెలీకాప్టర్ ముందు వెళ్ళి సర్వే నిర్వహించగా..ముఖ్యమంత్రి, మంత్రుల బృందం మరో హెలీకాప్టర్లో సర్వే హెలీకాప్టర్ వెంట వెళ్ళారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, డి ఐ జి చౌహాన్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, తదితరులు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకీ**

**- ఎస్పీ కార్యాలయానికి 11 ఫిర్యాదులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 3, ప్రభాతవార్త:** ప్రజా ఫిర్యాదులను తక్షణమేపరిష్కరించాలని, సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పోలీస్ వ్యవస్థ పని చేస్తుందని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకీ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎస్పీ డి. జానకి 11ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును పరిశీలిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ - ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యలకు తక్షణ న్యాయం జరిగే విధంగా ప్రతి ఫిర్యాదును సీరియస్‌గా పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. పోలీస్‌అధికారులు, సిబ్బంది ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వారి వినతులు చట్టపరంగా పరిష్కరించే దిశగాకృషి చేయాలని సూచించారు. తద్వారా ప్రజల్లో పోలీస్ శాఖపైవిశ్వాసం, నమ్మకం పెంపొందుతుందని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటిపరిష్కార స్థితినినిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు పారదర్శకంగా సేవలందించడం కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జానకీ

## జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో మంత్రి జూపలి

**చిన్నంబావి, నవంబరు3 ప్రభాతవార్త :** హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం ఎర్రగడ్డ డివిజన్‌లోని రాజీవ్ నగర్‌లోని బూత్‌లో సోమవారం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రచారం నిర్వహించిన వారిలో మంత్రివర్యులు జూపల్లి, చిన్నంబావి మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవిన్ యాదవ్ గెలుపుతో జూబ్లీహిల్స్ అభివృద్ధికి నాంది పలుకబోతుందని కాలనీ వాసులతో కలిసి కలియ తిరిగారు. మన ముఖ్యమంత్రి ఏనుమల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీతో నవీన్ యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటు వేసి గెలిపించాలని కోరారు. మంత్రివర్యులు జూపల్లితో పాటు చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల సంక్షేమానికి కృషి

**కళ్యాణ లక్ష్మితో కొండంత భరోసా**

**మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు3 ప్రభాతవార్త:** ఆడబిడ్డల వివాహానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబ్ నగర్ పట్టణ మరియు గ్రామీణ మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద కుటుంబాల్లో పుట్టిన ఆడబిడ్డల భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని వారికి ఆడబిడ్డలకు భరోసా కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వివాహ సమయంలో భారం తగ్గించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళల అభివృద్ధి, సాధికారత కోసం వారి పేరుతోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు పథకాలు ప్రవేశపెట్టామని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జి గోనెల శ్రీనివాసులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు శాంతన్న యాదవ్, ఖాజా పాషా, రాషెద్ ఖాన్, అంజద్, మోసిన్, ఉమర్, చిన్న, లక్ష్మణ్ నాయక్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్ కుమార్, నాగరాజు, లీడర్ రఘు , శ్యాం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

## అంతర్ రాష్ట్ర గంజాయి సరఫరా చేస్తున్న ముఠా అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఐ ఎస్.ఎంనవీద్, కృష్ణ పోలీసులు కున్సి గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు బైకులపై ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారి వద్ద సంచుల్లో గంజాయి ఉన్నట్లు బయటపడింది. తదుపరి సమాచారంతో పోలీసులు కృష్ణ రైల్వే స్టేషన్ వద్ద మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితులు మహారాష్ట్రలోని సోలాపూర్ కర్ణాటకలోని యాదగిర్ జిల్లాల నుండి గంజాయి తెచ్చి తెలంగాణలో చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. నిందితుల్లో సుఫియాన్ షాకు గతంలో నారాయణపేటలో గంజాయి కేసులో ప్రమేయం ఉన్నట్లు తేలింది. మొత్తం 12.4కిలోల గంజాయి, 2 మోటార్‌సైకిళ్లు, రూ.10,000 నగదు, 10 మొబైల్ ఫోన్లుస్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. నిందితుల వివరాలు సయ్యద్ అజార్ అలీ, మొహమ్మద్ సుఫియాన్‌షా, కనిగిరి విశాల్ నారాయణపేట ఉమేష్, సోనియా, లల్లన్, సమీర్ సయ్యద్‌యాదగిర్ కర్ణాటక తుకారాం, సమీర్, అక్షయ్‌సోలాపూర్ మహారాష్ట్ర చెందినవారు ఉన్నారు. ఎస్పీ మాటాడుతూ గంజాయి స్మగ్లింగ్ రవాణా విక్రయం వంటి చట్టవిరుద్ధ కార్యకలా పాల్లో పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం గంజాయి డ్రగ్స్‌పై జీరో టాలరెన్స్ విధానాన్ని కట్టు దిట్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. యువత భవిష్యత్తును చెడగొట్టే మాదకద్రవ్యాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలు గమనిస్తే వెంటనేటోల్ ఫ్రీనంబర్ 1908లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలిఅని ఎస్పీ సూచించారు. ఈ ఆపరేషన్‌లో డీఎస్పీనల్లపు లింగ య్య పర్యవేక్షణలో మక్తల్ సీఐరామ్‌లాల్, కృష్ణ ఎస్ఐ ఎస్.ఎం నవీద్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పురుషోత్తం, హెడ్‌కానిస్టేబుల్ గోప్య నాయక్, పోలీస్ సిబ్బంది రాఘవేంద్ర గౌడ్, రామస్వామి, అశోక్ కుమార్, శ్రీకాంత్‌పాల్గొన్నారు. ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులను అభినందించి వారికి రివార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు.

# తీరు మారలే..!

- **భూత్పూర్ తహసిల్‌లో ఒక్కో పనికి ఒక్కో రేటు?**
- **రైతుకు ఉచితంగా ఇవ్వాల్సిన ఆర్ఓఆర్ పహణీకి రు.2వేల నుంచి 3వేలు ముక్కు పిండి వసూలు?**
- **గతంలో ఏసీబీ దాడులు..ఓ ఆర్ఐ సస్పెన్షన్.. అయినా తీరు మారలే..!!**

**భూత్పూర్, నవంబర్ 3, ప్రభాతవార్త:** భూత్పూర్ తహసిల్ కార్యాలయం అవినీతికి నిలయమై, లంచాలమయంగా మారింవనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ కార్యాలయంలో ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి అవసరాలకు వచ్చే సామాన్య జనాలు, రైతులను ముక్కుపిండి వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు బాహాటంగా వినవస్తున్నాయి. ఇక రైతుకు అత్యంతావసరమైన పహణి ఆర్ఓఆర్ నఖళ్లకైతే అమాయకులైన రైతుల నుంచి రూ.రెండు నుంచి రూ.మూడు వేల వరకు లంచం ముట్టజెప్పందే ఇవ్వడంలేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఈ తతంగమంతా కార్యాలయంలో పనిచేసే కిందిస్థాయి ఉద్యోగులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం ఎమ్మార్వో వరకు తీసుకుపోకుండా గుట్టుచప్పుడు కాకుండా అవినీతికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మూణ్ణెళ్ల క్రితం ఇక్కడ పనిచేసే ఓ రూరల్ ఆర్ఐ పహణి వెరిఫై చేయడానికి, రాయడానికి ఓ రైతు నుంచి లంచంతీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి సస్పెన్షన్‌కు గురయ్యాడు .ప్రతి సామాన్యుడు తహసిల్ కార్యాలయానికి రావాలంటేనే జంకే పరిస్థితికి భూత్పూర్ తహసిల్ కార్యాలయం మారిందని పలవురు పెదవి విరుస్తున్నారు. ఇంత జరిగినా భూత్పూర్ తహసిల్ కార్యాలయంలోలంచాల తీరు మారలేదనే అనిపిస్తోంది. కార్యాలయంలో ప్రతీపనికి లంచంతీసుకునే అలవాటు ఆనవాయితీగా మారిందనే పలువరు విమర్శిస్తు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పనిచేసే కొందరుఉద్యోగులు కొందరు ప్రైవేట్ వ్యక్తుల్ని మధ్యవర్తులుగా చేసుకుని ఒక్కో పనికి ఒక్కో రేటును నిర్ణయించి వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే సామాన్య జనాలు, రైతుల నుంచిముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కార్యాలయంలో ఇంత జరుగుతున్నా సంబంధిత తహసిల్దార్ తనకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేవు.

**ఎమ్మార్వో మెతకధోరణి వల్లే...**

భూత్పూర్ తహసిల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎమ్మార్వో కిషన్‌నాయక్ మంచితనం, మెతక ధోరణి వల్లే కింది స్థాయి ఉద్యోగులు ఇలా రెచ్చిపోతూ ఈ లంచాల అలవాటు మరువలేకపోతున్నారనే విమర్శలున్నాయి. పెద్ద సార్ వరకు ఈవిషయం పొక్కకుండా కిందిస్థాయి ఉద్యోగులు, అధికారులు లోలోపల కష్టమర్లయిన రైతులు, జనాలు, విద్యార్థుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత తహసిల్దార్ తన మొతక ధోరణిని విడనాడి ఇలాంటి వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని, తన కార్యాలయంలో కింది స్థాయి అధికారులు, ఉద్యోగులెవరు చేసినా తహసిల్ కార్యాలయానికే చెడ్డపేరు వస్తుందని గ్రహించి, ఇలాంటి చెడ్డపేరు రాకుండా కార్యాలయంలోలంచాలకు, అవినీతికి పాల్పడే అధికారులు, ఉద్యోగులపై కఠిన వైఖరిని ప్రదర్శించాల్సిన అవసరముందని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**తహసిల్దార్ కిషన్‌నాయక్ వివరణ:** తమ కార్యాలయంలో పహణి, క్యాస్ట్ ఇతర సర్టిఫికేట్ల వెరిఫికేషన్‌కు డబ్బులు తీసు కుంటున్నట్లు తన దృష్టికి రాలేదని, ఎవరైనా ఏదేని పనికి డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలని అలాంటివారిపై చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ కిషన్‌నాయక్ స్పష్టం చేశారు. తమ కార్యాలయంలో ఏపనికైనా, ఏవిషయంలోనైనా డబ్బులు అడిగితే వెంటనే తనను సంప్రదించాలని తహసిల్దార్ కిషన్‌నాయక్ సూచించారు.

## చేప పిల్లల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం పారదర్శకంగా జరగాలి. ప్రస్తుతం 236 చెరువుల్లో చేప పిల్లలను వదులుతున్నట్లు తెలిపారు. మిగతా చెరువుల్లోనూ నీటి లభ్యతపై ఇరిగేషన్ అధికారులతో స్పష్టత తీసుకొని, వాటిలోనూ చేపపిల్లల పెంపకానికి సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు టీ మత్స్య మొబైల్ యాప్ గురించి ఇప్పటికే జిల్లాలో అవగాహన కల్పించామని, లబ్ధిదారులందరూ తమ వివరాలను ఇందులో నమోదు చేసుకునేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేస్తున్నట్లుపేర్కొన్నారు. జిల్లాలో రాజోలి, గట్టు, రేవులపల్లిలో చేపల మార్కెట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారిని షకీలాభాను, పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## దోపిడీని నియంత్రించేందుకే కొనుగోలు కేంద్రాలు

(మొదటి పేజీ తరువాయి)

ధాన్యానికి చెల్లింపులు సరైన సమయంలో అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్‌పట్ల ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గుమ్మళ్ల అశ్విని రాజేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ జవాజి శేఖర్ గౌడ్, తహసిల్దార్ రాధాకృష్ణ, ఏవో ప్రదీప్, పలువురు అధికారులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, తిర్మలాపూర్ గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పాల్గొన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయడం, సమస్యలను నేరుగా విని వెంటనే పరిష్కారం చూపించడం లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణికి వచ్చిన73 మంది దరఖాస్తుదారులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని దరఖాస్తు పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు దరఖాస్తులను పెండింగ్ లో నుంచకుండా తేరగా పరిష్కరించడం అన్ని శాఖల బాధ్యతని ఆమె తెలిపారు. ఆయా శాఖల జిల్లా అధికారులువారికి కేటాయించిన సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కె. జి.బి.వి లను నెల మొదటి వారం లో తనిఖీ చేసి విద్యా ఐఅప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. వానాకాలం పంట కొనుగోలుకు సంబంధించి ఐ కె.పి, పి. ఏ .సి ఎస్‌ల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కనీస సౌకర్యాలను, కొనుగోలు కేంద్రాలలో కావలసిన సదుపాయాలుఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రారంభించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసుకొనని లబ్ధిదారులను రద్దు చేసివారి స్థానంలో స్థానిక శాసన సభ్యులతోఇందిరమ్మ కమిటీ సభ్యులతో చర్చించి కొత్తగా ప్రతిపాదనలను పంపేలాచర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, వివిధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

**మహిళా జట్టు విజయంపై పీయూలో సంబురాలు**

**మహబూబ్‌నగర్ నవంబర్ 3, ప్రభాతార్త:** పాలమూరు యూనివర్సిటీ క్రీడా విభాగం ఐసీసీ ఉమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్ 2025 లో ఫైనల్ మ్యాచ్ భారత్ వర్సెస్ సౌత్ ఆఫ్రికా మధ్య జరిగిన ఉత్కంఠ పోరులుభారత్ ఉమెన్స్ క్రికెట్ టీంవిజయం సాధించడంపై పాలమూరు విశ్వవిద్యాలయంలో సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాలమూరు యూనివర్సిటీ క్రీడా విభాగానికి చెందిన అధికారులు పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఏర్పాటు చేసిన సమావేంలో భారత జట్టుపై ప్రశంసలు కురిపించారు. కార్యక్రమంలోపాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్ బాబు , అకాడమిక్ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్ర కిరణ్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ కె ప్రవీణ, కృష్ణ, ఫార్మసి ప్రిన్సిపల్ రవికాంత్, ఫిజికల్ డైరెక్టర్ డా. వై శ్రీనివాస్ పాల్గొన్నారు,